సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 27 । జనవరి । 2025



చైన్‌స్నాచర్ల హల్‌చల్
చైన్‌స్నాచర్లు చెలరేగిపోయారు. రెండు వేర్వేరు చిల్లరదుకాణాల వద్ద మహిళల మెడలోని చైన్లను లాక్కుని ద్విచక్రవాహనాలపై ఉడాయించారు. 8లో



టమాట కిలో రూ.14
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.14 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.11 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.2°/8.1°

జిల్లా పరిధిలో ఆదివారం చలి వాతావరణం పెరిగింది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

బీసీ హాస్టల్‌లో ఆకలి కేకలు

- రిపబ్లిక్‌డే రోజున వంట చేయని వైనం
- వసతిగృహం అధికారిపై కలెక్టర్ సీరియస్
- ఆర్డీఓ వెళ్లాక హుటాహుటిన వంట



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ, తహసీల్దార్

చెన్నేకొత్తపల్లి: బీసీ వసతిగృహంలో ఆకలి కేకలు మిన్నంటాయి. గణతంత్ర దినోత్సవం రోజున వంట చేయకుండా విద్యార్థులను పస్తులుంచారు. వసతిగృహం అధికారి నిర్లక్ష్యంపై కలెక్టర్ చేతన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకెళ్తే.. చెన్నేకొత్తపల్లిలోని బీసీ వసతిగృహంలో 120 మంది విద్యార్థులు ఉన్నారు. వీరు ఆదివారం ఉదయాన్నే తమ పాఠశాలలకు వెళ్లి రిపబ్లిక్‌డేలో పాల్గొన్నారు. వేడుకలు ముగిసిన అనంతరం హాస్టల్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం అవుతున్నా వంట చేయలేదు. ఆకలికి తట్టుకోలేకపోయిన కొందరు విద్యార్థు తమవద్ద ఉన్న పాకెట్ మనీతో సమీపంలోని హోటల్‌కు వెళ్లి తిన్నారు. మరికొందరు పార్సిల్స్ తీసుకొచ్చి తోటి విద్యార్థులతో కలిసి తలా రెండు ముద్దలు తిని సరిపెట్టుకున్నారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పడి ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. కలెక్టర్ ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. హాస్టల్‌ను తనిఖీ చేసి నివేదిక పంపాలని ధర్మవరం ఆర్డీఓ మహేష్‌ను ఆదేశించారు. హుటాహుటిన ఆర్డీఓ చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ సురేష్‌కుమార్‌తో కలసి వసతిగృహాన్ని సందర్శించారు. ఆ సమయంలో వసతి గృహం అధికారి లేరు. ఆకలికి నకనకలాడుతున్న విద్యార్థులను చూసి ఆర్డీఓ చలించిపోయారు. తక్షణమే భోజనం తయారు చేసి విద్యార్థులకు పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అప్పటికప్పుడు వంట తయారు చేసి వడ్డించారు. ఈ సందర్భంగా వసతిగృహంలో తాగునీరు లేదని, మరుగుదొడ్లు సరిగా లేవని, గదుల్లో ఫ్యాన్లు పనిచేయకపోవడంతో దోమలతో ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆర్డీఓ విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్‌లో విచారణ చేసి, తయారు చేసిన నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు.

30న జాబ్ మేళా



మడకశిర: ఈ నెల 30వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు మడకశిరలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు వారు ఆదివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జాబ్‌మేళాలో మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటాయని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ చేసి, 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగిన యువతీ యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన వారు పెనుకొండ, హిందూపురం, అనంతపురం, బెంగళూరు, హైదరాబాద్‌లో పని చేయాల్సి ఉంటుందని, రూ.12 వేల నుంచి రూ.20వేల వరకు వేతనం ఇస్తారని వివరించారు. విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఫొటో, ఆధార్ కార్డు, బయోడేటాతో జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం




సంఘటన స్థలంలో బైక్.. మృతుడు హరి

ముదిగుబ్బ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మంగళమడక గ్రామానికి చెందిన సాకే హరి (27) ప్రైవేట్ సబ్బుల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి ముదిగుబ్బ నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మార్గం మధ్యలోని రామస్వామి తండా సమీపంలో రోడ్డుపై ఉన్న రాళ్లకుప్ప కనిపించపోవడంతో బైక్ అదుపు తప్పడంతో హరి ఎగిరి కిందపడి దొర్లుతూ సమీపంలోని గుంతలో పడిపోయాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో గుర్తించలేకపోయారు. తర్వాత కొంతసేపటికి రోడ్డు పక్కన ద్విచక్రవాహనం పడి ఉండడం గమనించిన వాహనదారులు వెదుక్కుంటూ వెళ్లగా గుంతలో హరి కనిపించాడు. అయితే అప్పటికే అతను మృతి చెందాడు. హరికి భార్య లత ఉంది.

గణతంత్ర కీర్తి.. ఎనలేని ఖ్యాతి



మురిసిన మువ్వన్నెల జెండా

- ఘనంగా గణతంత్ర వేడుకలు
- సాయుధ దళాల గౌరవవందనం స్వీకరించిన కలెక్టర్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- దేశభక్తిని పెంపొందించిన గేయాలు

జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న తదితరులు

ప్రశాంతి నిలయం/ పుట్టపర్తి టౌన్: మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. జాతీయ పతాకానికి ప్రతి ఒక్కరూ సగర్వంగా వందనం చేశారు. ఆదివారం పోలీసు పరేడ్ మైదానంలో 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. పోలీసు జాగిలాల విన్యాసాలు ఔరా అనిపించాయి. ఏఆర్ సిబ్బంది మార్చ్‌ఫాస్ట్ అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ధర్మవరం జీవనజ్యోతి పాఠశాల విద్యార్థుల 'నవనీ జగతి ఆంధ్రప్రదేశ్ నవస్' పాట దేశభక్తిని చాటింది. జగరాజుపల్లి కేజీబీవీ విద్యార్థులు 'మూడు రంగుల జెండా ప్రతి పౌరునికీ అండ' అనే దేశభక్తి గేయం, కదిరి ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థులు బంజారా పాటలు, గోరంట్ల ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, బుక్కపట్నం డైట్ కాలేజీ విద్యార్థులు 'మేరా భారత్‌కో సలాం' అనే దేశ భక్తి గేయంతో ఆకట్టుకున్నారు.

ఆకట్టుకున్న శకటాలు
గణతంత్ర వేడుకల్లో వివిధ శాఖలు ప్రదర్శించిన తొమ్మిది ప్రగతి రథాలు (శకటాలు) ఆకట్టుకున్నాయి. ప్రథమ స్థానంలో హిందూపురం మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ శకటం, ద్వితీయ స్థానంలో పంచాయతీరాజ్, తృతీయ స్థానంలో ఉపాధిహామీ శకటం, నాల్గవ స్థానంలో పౌరసరఫరాల శకటం నిలిచాయి. ఇక వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 16 స్టాళ్లలో వైద్య ఆరోగ్య శాఖ స్టాల్ ప్రథమ బహుమతి, అటవీశాఖ ద్వితీయ, పశుసంవర్ధక శాఖ తృతీయ స్థానంలో నిలిచాయి.



రింగులోంచి దూకుతున్న పోలీసు జాగిలం

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

ప్రశాంతి గ్రామ్ వద్ద ఉన్న పోలీసు పరేడ్ మైదానంలో 76వ గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్య్ర సమరయోధులకు, ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు గణతంత్ర శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగ రూపకల్పన కోసం కృషి చేసిన మహనీయులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జిల్లా ప్రగతి నివేదికలను కలెక్టర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఉచిత ఇసుక సరఫరా, అన్న క్యాంటీన్ ద్వారా తక్కువ ధరకే భోజనం వంటివి జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు.రాబోవు రోజుల్లో ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లా అధికార యంత్రాంగాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుదామని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు. పారదర్శకత, సమష్టి కృషితో పనిచేసి అన్ని రంగాల్లోనూ గణనీయమైన ప్రగతి సాధించి జిల్లాను అభివృద్ధి పథంలో నిలపాలన్నారు. పుట్టపర్తి సమీపంలోని ప్రశాంతి గ్రామ్ వద్ద



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ వి.రత్న, డీఆర్‌ఓ విజయసారథి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డితో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధిపతులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.




ప్రశాంతి గ్రామ్ వద్దనున్న పోలీస్ పరేడ్ మైదానంలో గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అరటి ఎగుమతులు.. లేని గొప్పలు!



అరటి తోట



2019 జనవరి 30న జెండా ఊపి జిల్లా నుంచి గల్ఫ్ దేశాలకు అరటి ఎగుమతులు ప్రారంభిస్తున్న అప్పటి వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు (ఫైల్)

- గత ప్రభుత్వ హయాంలోనే జిల్లా అరటికి అంతర్జాతీయ ఖ్యాతి
- 'హ్యాపీ బనానా' పేరుతో అరబ్ దేశాలకు అరటి ఎగుమతులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవల మరోసారి రవాణా
- అయినా తామే తొలిసారి ఎగుమతి చేసినట్లు డాంబికాలు
- 31న 'అనంత'లో 'హార్టికల్చర్ కాన్‌క్లేవ్'

అనంతపురం అగ్రికల్చర్: 2004–2009 మధ్య కాలంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన రాయితీలు, ప్రోత్సాహంతో అనంతపురం జిల్లా 'ఫ్రూట్ బౌల్ ఏపీ'గా ఖ్యాతి పొందింది. ఆ తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న 2019–2024 మధ్యకాలంలో పండ్లతోటల రైతులను మరింత ప్రోత్సహించడంతో ఉద్యానహబ్ దిశగా అడుగులు పడ్డాయి. చీనీ, అరటి, మామిడి, దానిమ్మ, టమాట, పూలు లాంటి ఉద్యాన ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ కల్పించే దిశగా ఎగుమతులకు శ్రీకారం చుట్టారు. దేశంలో మరెక్కడా లేని విధంగా జిల్లా నుంచి అరబ్ దేశాలకు అరటి ఎగుమతులకు 2019 జనవరి 30న పుట్లూరు మండలం కడవకల్లు వేదికగా నాంది పలికారు. తాడిపత్రి రైల్వేస్టేషన్ నుంచి నేరుగా ముంబై పోర్టు, అక్కడి నుంచి గల్ఫ్ దేశాలకు 'హ్యాపీ బనానా' పేరుతో నాణ్యమైన అరటిని ఎగుమతి చేశారు.

అరటికి నిలయం..
అనంతపురం జిల్లా అరటి తోటలకు నిలయంగా మారుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12,250 హెక్టార్ల భారీ విస్తీర్ణంలో అరటి సాగవుతోంది. నార్పల, పుట్లూరు, యల్లనూరు, బెళుగుప్ప, యాడికి, పెద్దపప్పూరు, తాడిపత్రి, తాడిమర్రి, కనగానపల్లి మండలాల్లో ఎక్కువగానూ, రాప్తాడు, అనంతపురం, శింగనమల, ఉరవకొండ, కూడేరు, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, బత్తలపల్లి, ధర్మవరం తదితర మండలాల్లో కొంత వరకు అరటి తోటలు విస్తరించాయి. 95 శాతం గ్రాండ్–9 రకం కాగా కొంత యాలక్కీ రకం కూడా సాగు చేస్తున్నారు. జిల్లా అరటికి దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ పరంగా డిమాండ్ నెలకొంది. 65 శాతం వరకు ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండగా...తెలంగాణ, కర్ణాటక, ఏపీ ప్రాంతాల్లో మిగతాది మార్కెటింగ్ చేస్తున్నారు. నాణ్యత విషయంలో ఈక్వెడార్, పెరు, ఫిలిప్పీన్స్, హొండూరస్ లాంటి కొన్ని దేశాల సరసన నిలుస్తుండటం విశేషం.

31న అనంతలో హార్టికల్చర్ కాన్‌క్లేవ్..

గతంలో వైఎస్ జగన్ సర్కారు తీసుకున్న చర్యలు అరటి రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నదాతలు అంటున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 31న స్థానికంగా ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో 'అనంత హార్టికల్చర్ కాన్‌క్లేవ్' పేరుతో సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఉత్పత్తిదారులు, కొనుగోలుదారులు, ఎగుమతిదారులు పాల్గొననున్నట్లు తెలిసింది. రెండు జిల్లాలతో పాటు వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, చిత్తూరు తదితర అరటి పండించే జిల్లాల నుంచి రైతులు హాజరు కానున్నారు. దేశీయంగా, అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేస్తున్న కొనుగోలు సంస్థలు, ఎగుమతి కంపెనీ ప్రతినిధులు దాదాపు 25 సంస్థల నుంచి ప్రతినిధులు హాజరై ఉత్పత్తిదారులు, ఉద్యానశాఖతో ఒప్పందాలు చేసుకునే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

కూటమి గొప్పలు..
గతంలో ఎన్నడూ లేని విధంగా అరటికి మొదటి సారిగా ఉచిత పంటల బీమా పథకం అమలు చేసిన ఘనత కూడా వైఎస్ జగన్ సర్కారుకే దక్కుతుంది. అలా గత సర్కారు ఇచ్చిన ప్రోత్సాహకాలు, చర్యల కారణంగా అరటి సాగు విస్తీర్ణం పెరిగింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాదిరిగానే ఇటీవల అరబ్ దేశాలకు అరటి ఉత్పత్తులను ఎగుమతి చేశారు. అయితే, గతం మరిచి కూటమి ప్రభుత్వంలోనే తొలిసారి అరటి ఎగుమతులు ప్రారంభించినట్లు ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం గొప్పలు చెప్పుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి.

అనంతపురం జిల్లాలో అరటి సాగు విస్తీర్ణం	10,250 హెక్టార్లు
అరటి సాగు చేస్తున్న రైతుల సంఖ్య	12,800 మంది
ఏటా అరటి దిగుబడులు	6.5 లక్షల మెట్రిక్ టన్నులు
శ్రీ సత్యసాయి జిల్లాలో అరటి సాగు విస్తీర్ణం	2 వేల హెక్టార్లు
అరటి సాగు చేస్తున్న రైతుల సంఖ్య	2,500 మంది
ఏటా అరటి దిగుబడులు	1.20 లక్షల మెట్రిక్ టన్నులు
ఉమ్మడి జిల్లా పరిధిలో అరటి దిగుబడులు	7.70 లక్షల మెట్రిక్ టన్నులు

అరాచకాలకు మంత్రి సవిత ఆజ్యం

- శివమాలధారుడిపై దాడికి మంత్రిదే బాధ్యత
- అధికారం శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలి
- మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

పరిగి: పెనుకొండ నియోజకవర్గంలో అవినీతి అక్రమాలు, అరాచకాలు, అలజడులకు మంత్రి సవిత ఆజ్యం పోస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజమెత్తారు. ఆదివారం పరిగి మండలం మోదాలో ఉషశ్రీచరణ్ మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారంటూ మంత్రి సవిత, ఆమె భర్త వెంకటేశ్వరరావుపై విమర్శలు చేశారు. పెనుకొండలో శనివారం శివమాల ధారుడు శ్రీనివాసులుపై మంత్రి ప్రధాన అనుచరుడు దాదు చెప్పుల కాలితో దాడిచేసి, అవమానపరిచాడని, ఇందుకు మంత్రి సవిత బాధ్యత వహించాలని అన్నారు. మంత్రి దంపతుల ప్రోద్బలంతోనే అరాచకాలు పేట్రేగిపోతున్నాయని, పోలీసులు కూడా ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. పెనుకొండలో సుధాకర్‌రెడ్డి భూమి కబ్జా చేసినా, జయచంద్రారెడ్డికి మంత్రి భర్త అనుచరుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని చెప్పినా పట్టించుకోని పోలీసులు తాజాగా గోరంట్లలో ఓ వ్యవహారంలో ఎంక్వయిరీ పేరిట నార్శింపల్లి శివారెడ్డిని మంత్రి ప్రోద్బలంతోనే అక్రమంగా ఎఫ్ఐఆర్‌లో చేర్చి అరెస్టు చేశారన్నారు. అక్రమ కేసులపై న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అధికార బలంతో అరాచకాలు సృష్టించి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరిస్తున్న మంత్రి సవితకు ఒక్క నిమిషం కూడా పదవిలో కొనసాగే అర్హత లేదన్నారు. తక్షణమే ఆమె తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అధికారం శాశ్వతం కాదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఈ ప్రాంతంపై సీఎం ప్రత్యేక దృష్టి సారిస్తే అక్రమాలు వెలుగుచూస్తాయన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోండి



సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ బృందం

ప్రశాంతి నిలయం: సత్యసాయి స్ఫూర్తితో యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని ఎంచుకున్న రంగంలో రాణించాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ రాజు పేర్కొన్నారు. ప్రశాంతి నిలయంలో యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించే లక్ష్యంతో సత్యసాయి సేవా సంస్థలు చేపట్టిన శిక్షణ ప్రారంభోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా యువత యజుర్ మందిరం నుంచి ర్యాలీగా సత్యసాయి బోధనలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శిస్తూ మహాసమాధి చెంతకు విచ్చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుని ప్రసంగించారు. సత్యసాయిపై భక్తిని చాటుతూ సంగీత కచేరీ నిర్వహించారు. అనంతరం యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించే కార్యక్రమంలో భాగంగా శిక్షణలో పాల్గొన్న 418 మంది విద్యార్థులు 108 ప్రాజెక్ట్‌లను చక్కటి ఫలితాలతో పూర్తి చేశారు. ప్రాజెక్టులతో పాల్గొన్న విద్యార్థుకు రత్నాకర్‌రాజు, ట్రస్ట్ సభ్యులు చక్రవర్తి, నిమిష్ పాండే తదితరులు ప్రశంసాపత్రాలు అందజేశారు. 'సాయి ప్రేరణ' పేరుతో యువతకు స్ఫూర్తినిచ్చే సందేశ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



హిందూపురం అర్బన్: స్థానిక కిరికెర గేట్ వద్ద శనివారం రాత్రి ఓ గుర్తు తెలియని వృద్ధురాలు (70) మృతి చెందింది. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనారోగ్యానికి తోడు చలి తీవ్రత కారణంగా ఆమె మృతి చెందినట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆచూకీ తెలిసిన వారు హిందూపురం రెండో పట్టణ పీఎస్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతుడు గంగాధర్

ధర్మవరం రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం మండలం మల్లాకాలువ గ్రామానికి చెందిన రైతు సాకే గంగాధర్ (38) తన పొలంలో సాగు చేసిన వేరుశనగ పంటను అడవి పందులు నాశనం చేస్తుంటే చుట్టూ ఇనుపతీగను అమర్చాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇనుప తీగకు విద్యుత్ స్తంభం నుంచి కరెంట్ ఇవ్వడానికి కట్టెతో వైరును తగిలిస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం అటుగా వెళ్లిన కాపరులు గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని గంగాధర్ మృతదేహంపై పడి బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ధర్మవరం రూరల్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి భార్య ప్రభావతి, ఓ కుమార్తె ఉన్నారు.

జాతీయ జెండాకు అవమానం!



కిందకు జారిన జాతీయ జెండా

హిందూపురం: గణతంత్ర వేడుకల సాక్షిగా జాతీయ జెండాకు తీరని అవమానం జరిగింది. హిందూపురం మున్సిపాల్టీ పరిధిలోని 2వ వార్డు చౌడేశ్వరి కాలనీ సచివాలయం ప్రాంగణంలో ఆదివారం ఉదయం అధికారులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కాసేపటికే జెండా కిందకు జారిపోయింది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు... అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.





గణతంత్ర వేడుకల్లో ప్రథమ బహుమతి దక్కించుకున్న హిందూపురం మున్సిపాలిటీ శకటం, ద్వితీయ బహుమతిని దక్కించుకున్న పంచాయతీరాజ్ శకటం



తృతీయ బహుమతిని కైవసం చేసుకున్న డ్వామా శకటం

• విశిష్ట సేవలకు ప్రశంస

విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు, సామాజిక సేవా కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలను కలెక్టర్ చేతన్ ప్రదానం చేశారు. మొత్తం 91 ప్రభుత్వ శాఖలకు సంబంధించి విశిష్ట సేవలు అందించిన జిల్లా స్థాయి అధికారులు 43 మందితో పాటు వివిధ శాఖలకు చెందిన 518 మంది ఉద్యోగులను అవార్డులకు ఎంపిక చేశారు. వీరికి పోలీస్ పరేడ్ మైదానంలో అవార్డులను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ వి.రత్న, వివిధ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

– పుట్టపర్తి టౌన్:



కలెక్టర్ చేతన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి



ఆర్డీఓ సువర్ణ



ఆనందకుమార్, ఆర్డీఓ, పెనుకొండ; వీవీఎస్ శర్మ, ఆర్డీఓ, కదిరి; విజయ్‌కుమార్, డీపీఓ; వైవీ సుబ్బారావు, జేడీఏ; చంద్రశేఖర్, ఏడీ, హార్టికల్చర్



వి.హరికృష్ణ, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ; సుదర్శన్, ఏపీఎంఐపీ పీడీ; పద్మమ్మ, జేడీ, సెరికల్చర్; శుభదాస్, జేడీ, పశుసంవర్ధక శాఖ; చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీ, మత్స్యశాఖ



చక్రపాణి, అటవీ శాఖాధికారి; మల్లికార్జునరావు, ఏడీ, భూగర్భజలశాఖ; ఎంఎల్ఎన్ మూర్తి, మార్కెటింగ్ శాఖ; గీతమ్మ, మేనేజర్; వంశీకృష్ణారెడ్డి, డీఎస్‌ఓ; కేఎన్ నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ; కె.విజయ్‌ప్రసాద్, పీడీ, డ్వామా; హరికృష్ణ నైపుణ్యా భివృద్ధి అధికారి; శివరంగప్రసాద్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి; మోహన్‌రామ్, ఎస్టీ వెల్ఫేర్ అధికారి; నిర్మలజ్యోతి, బీసీ వెల్ఫేర్ అధికారి; కిష్టప్ప, డీఈఓ; మురళీమోహన్, ఎస్ఈ, పీఆర్; కమాల్‌బాషా, రీజనల్ విజిలెన్స్ సీఐ; మల్లికార్జునప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ



సురేంద్ర, ఎస్ఈ, ట్రాన్స్‌కో; సమత, పంచాయతీ అధికారి; వెంకటనారాయణ, పీడీ, హౌసింగ్; విజయశాంతిబాయి, సర్వే అధికారి; వేలాయుధం, ఐఅండ్‌పీఆర్; సుధాకర్‌రెడ్డి, నోడల్ అధికారి; కృష్ణానాయక్, కోఆపరేటివ్ అధికారి; నాగరాజప్ప, పరిశ్రమల అధికారి; శ్రీరాములు, మున్సిపల్ కమిషనర్; కిరణ్‌కుమార్, కదిరి మున్సిపల్ కమిషనర్; రామకృష్ణ, చేనేత జౌళి శాఖాధికారి; తిప్పయ్య, టీబీ అధికారి; సురేష్‌బాబు, కలెక్టర్ సీసీ; రాజశేఖర్, కలెక్టర్ సీసీ; వినోద్‌కుమార్, జేసీ సీసీ



నాగరాజు, కలెక్టర్ పీఎస్‌ఓ; విజయ్‌కుమార్, పుట్టపర్తి డీఎస్పీ; బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్‌బీ సీఐ; వి.శ్రీనివాస్, డీసీఆర్‌బీ సీఐ; సీఐ సతీష్‌కుమార్, ఎస్పీ ఆఫీస్; బొజ్జప్ప, ఎయిర్ పోర్టు సీఐ; డాక్టర్ అశ్వత్థకుమార్, కొత్తచెరువు పీహెచ్‌సీ; ఎం.పవిత్ర, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్; పి.సింధు అసిస్టెంట్ సప్లయీస్ ఆఫీసర్; రామన్న, ఐఅండ్‌పీఆర్; పుష్పవతి, డ్వామా హెచ్‌ఆర్ మేనేజర్

చైన్‌స్నాచర్ల హల్‌చల్

ధర్మవరం అర్బన్: స్థానిక వైఎస్సార్ కాలనీలో ఆదివారం ఉదయం 7గంటల సమయంలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు... వైఎస్సార్ కాలనీలో నివాసముంటున్న శశికళ ఆదివారం ఉదయం చిల్లర దుకాణం వద్ద సరుకులు తీసుకుంటుండగా రెడ్‌కలర్ పల్సర్ బైకుపై వచ్చిన ఇద్దరు ఆగంతకులు ఆమె మెడలోని 3 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లారు. ఆ సమయంలో ఆమె కేకలు వేసినా ఫలితం లేకపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

మహిళను ఏమార్చి...

నల్లమాడ: మహిళను ఏమార్చి ఆమె మెడలోని బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లారు. సీఐ నరేంద్రరెడ్డి తెలిపిన మేరకు... నల్లమాడ మండలం డి.చెర్లోపల్లికి చెందిన రత్నమ్మ రోడ్డు పక్కన బంక్‌లో వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఆదివారం సాయంత్రం దొన్నికోట వైపు నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు బంక్ వద్ద వాహనం ఆపి వాటర్ బాటిల్ కావాలని అడిగారు. దీంతో ఆమె ఫ్రిడ్జ్ నుంచి వాటర్ బాటిల్ తీస్తుండగా ఆమె మెడలోని బంగార్ చైన్‌ను లాక్కొని ద్విచక్ర వాహనంపై శరవేగంగా ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా..

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకూ తాను అండగా ఉంటానని రాప్తాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసానిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారంటూ మదిగుబ్బ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జింకల రామాంజనేయులును ఇటీవల పోలీసులు విడుదల చేశారు. విషయం తెలుసుకున్న ప్రకాష్‌రెడ్డి ఆదివారం మదిగుబ్బ గ్రామానికి చేరుకుని జింకల రామాంజనేయులు, ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలమన్నారు. ఉద్దేశ పూర్వకంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వలంటరీ విభాగం అధ్యక్షుడు ఓబుగారి హరినాథ్ రెడ్డి, సర్పంచ్ నరసింహులు, వీరాంజినేయులు, యువజన విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, రామగిరి మండల కన్వీనర్ మీనుగ నాగరాజు, అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జింకల రామాంజనేయుల కుటుంబసభ్యులతో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

- అనుమానాస్పద మృతిగా రైల్వే పోలీసుల కేసు నమోదు
- ఇది హత్యేనంటున్న బాధిత కుటుంబ సభ్యులు

అనంతపురం సిటీ: స్థానిక జీఆర్పీ పరిధిలోని తాటిచెర్ల రైల్వే గేట్ వద్ద ఆదివారం ఉదయం ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడిని సమాచారం అందుకున్న జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన తిమ్మిరెడ్డి ఉమామహేశ్వరరెడ్డి(24)గా నిర్ధారించారు. రైల్వే ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...శనివారం రాత్రి ఈ ఘటన జరిగి ఉండవచ్చునని, అయితే ఆదివారం ఉదయం కనుగొన్నట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి తిమ్మిరెడ్డి మల్లిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, ఆస్తి వివాదాల కారణంగా తన కుమారుడిని తోపుదుర్తికి చెందిన కొందరు హతమార్చి ఉంటారనే అనుమానాలను ఫిర్యాదులో మల్లిరెడ్డి పేర్కొన్నారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంతటి పిరికివాడు కాదని, ఇది కచ్చితంగా హత్యేనని అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ దిశగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ఉమామహేశ్వరరెడ్డి (ఫైల్)

ప్రైవేటు పాఠశాల బస్సు బోల్తా

గుమ్మఘట్ట మండలంలోని గోనబావి క్రాస్ సమీపంలో స్థానిక ఓ ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో నలుగురు విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వివరాలు... గుమ్మఘట్ట నుంచి రాయదుర్గం పట్టణానికి ప్రైవేటు పాఠశాల బస్సులో ఏడుగురు విద్యార్థులు బయలుదేరారు. గోనబావి క్రాస్ వద్దకు రాగానే బ్రేక్ ఫెయిల్ కావడంతో బస్సు అదుపు తప్పిబోల్తాపడింది. విద్యార్థులు గగన్‌దీప్(2వ తరగతి), మంజుల(ఎల్‌కేజీ), రిషిత (6వ తరగతి), నిశ్చిత (4వ తరగతి)కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులు క్షేమంగా ఉన్నట్లు ఎంఈఓ నాగమణి తెలిపారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి.. ఎంఈఓకు ఫోన్ చేసి విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

నర్సులపై చిన్నచూపు

- అవార్డులకు ఎంపిక చేయని వైనం

అనంతపురం మెడికల్: ప్రాణాలకు తెగించి రోగులకు విశిష్ట సేవలు అందిస్తున్న నర్సులపై జిల్లా అధికార యంత్రాంగం చిన్నచూపు చూసింది. ప్రభుత్వ సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 360 మంది స్టాఫ్‌నర్సులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో 44 మంది హెడ్ నర్సులు, 102 మంది రెగ్యులర్ స్టాఫ్‌నర్సులు, 48 కాంట్రాక్ట్ 1, 132 క్రాంట్రాక్ట్ 2 స్టాఫ్‌నర్సులున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏ ఒక్కరినీ అవార్డులకు ఎంపిక చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. ఉమ్మడి జిల్లా ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోజూ 3వేల నుంచి 4వేల మంది ప్రత్యక్షంగా వైద్యం పొందుతుంటారు. పసికందులు మొదలుకుని గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, క్షతగాత్రులు, తదితరులు వేల సంఖ్యలో వైద్యం పొందుతుంటారు. రోగులకందించే సేవల్లో వైద్యులది 30 శాతం పాత్ర అయితే..70 శాతం పాత్ర స్టాఫ్‌నర్సులదే కావడం విశేషం. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో సర్వజనాస్పత్రిలో స్టాఫ్‌నర్సులు ప్రాణాలకు తెగించి రోగులకు సేవలందించారు. వీరి సేవలను గుర్తిస్తూ అప్పటి ప్రభుత్వం వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డును అందజేసి సత్కరించింది. తాజాగా అవార్డులకు స్టాఫ్ నర్సులను దూరంగా పెట్టడం దుమారం రేపుతోంది.

దానిమ్మ చెట్లకు నిప్పు

- కాలి బూడిదైన 4,500 చెట్లు

కంబదూరు: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో కంబదూరు మండలం కర్తనపర్తి గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర సాగు చేసిన దానిమ్మ చెట్లు కాలిపోయాయి. తనకున్న10 ఎకరాల్లో ఆరేళ్ల క్రితం దానిమ్మ మొక్కలను నాటాడు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. మంటలు ఎగిసి పడడంతో 10 ఎకరాల్లోని 4,500 దానిమ్మ చెట్లు, డ్రిప్ ల్యాడర్ కాలి బూడిదయ్యాయి. దీంతో రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని విన్నవించాడు.

30న ఏపీ అర్చక సమాఖ్య సమావేశం


అనంతపురం కల్చరల్: ఈ నెల 30న ఉదయం 11 గంటలకు అనంతపురంలోని మొదటి రోడ్డులో ఉన్న కాశీవిశ్వేశ్వరాలయంలో ఏపీ అర్చక సమాఖ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు పూజారి భీమప్ప, ప్రధాన కార్యదర్శి శివశంకర శర్మ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్సు, డీడీఎన్ఎస్, మారేజీ, మెడికల్, హౌసింగ్ లోన్సు వంటి అంశాలుంటే వివరాలతో రావాలని సూచించారు. సమావేశానికి ఎండోమెంటు అధికారులు సమావేశానికి హాజరవుతారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయ్యో..పాపం!

- నవజాత శిశువుపై పడిన వేడి గంజి
- ముఖం, కాళ్లు, చేతులు పూర్తిగా కాలిన వైనం
- తల్లడిల్లిపోతున్న చిన్నారి

అనంతపురం: అనంతపురం నగరంలోని రాణీనగర్‌కు చెందిన నవజాత శిశువుపై వేడి గంజి పడి ముఖం, కాళ్లు, చేతులు పూర్తిగా కాలిపోయాయి. గాయాల మంటకు చిన్నారి తల్లడిల్లిపోతోంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాణీనగర్‌కు చెందిన ముదినాబేగం ఇటీవల ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ శిశువును శుక్రవారం పొరుగింటి అమ్మాయి ఆడిస్తానని చెప్పి తీసుకెళ్లింది. అరగంటలోనే తీవ్ర కాలిన గాయాలతో తల్లడిల్లుతున్న శిశువును తెచ్చిఇచ్చింది. ఏమైందని కుటుంబ సభ్యులు అడగ్గా.. పొరపాటున వేడి గంజి పడిందని చెప్పి పాపను ఇచ్చి వెళ్లిపోయింది. తీవ్ర గాయాలతో తల్లడిల్లుతున్న చిన్నారిని కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఉద్దేశపూర్వకంగానే చిన్నారిపై గంజి పోశారని తల్లి ముదినాబేగం ఆరోపిస్తోంది.

వివాహిత బలవన్మరణం



మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబసభ్యులు



విజయ (ఫైల్)

పెద్దవడుగూరు: మండలంలోని మల్లేనిపల్లికి చెందిన వివాహిత విజయ (35) ఆత్మహత్య చేసుకుంది. భర్త, కుమారుడితో కలసి కొంత కాలంగా పెద్దవడుగూరులో నివాసముంటున్న ఆమె... తన సొంతూరిలో ఉన్న భూమిలో పత్తి సాగు చేపట్టారు. ఆదివారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి పొలం వద్దకు వెళ్లిన ఆమె.. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో బహిర్భూమికంటూ భర్తకు తెలిపి వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో భర్త గాలిస్తూ వెళ్లాడు. పొలం మధ్యలో విగతజీవిగా పడి ఉన్న భార్యను గమనించి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లోని రైతులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆమె పక్కనే ఖాళీగా పడి ఉన్న డబ్బాను గమనించి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఆంజనేయులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, విజయ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.